


	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34.0	28.0
భద్రాద్రి	38.0	25.0



శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మాక్ కౌంటింగ్ దృశ్యం

గత 20 రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠకు మంగళవారం తెర పడనుంది. హోరాహోరీగా సాగిన పోరులో విజేతలెవరో.. పరాజితులెవరో తేలిపోనుంది. ఓటు ద్వారా ఓటరు ఎలాంటి మేజిక్ చేశాడో వెల్లడి కానుంది. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజవర్గాలకు గత నెల 13న ఎన్నికలు జరిగిన విషయం విదితమే. ఖమ్మం బరిలో రామసహాయం రఘురాంరెడ్డి (కాంగ్రెస్), నామా నాగేశ్వరరావు (బీఆర్‌ఎస్), తాండ్ర వినోద్‌రావు (బీజేపీ) తలపడగా, మహబూబాబాద్ బరిలో పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్), మాలోతు కవిత(బీఆర్‌ఎస్), అజ్మీర సీతారాంనాయక్(బీజేపీ) పోటీ పడ్డారు. వీరిలో ఎవరు విజేతలుగా నిలవనున్నారనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఖమ్మం లోక్‌సభ ఓట్ల లెక్కింపు ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీ (కిట్స్)లో, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మహబూబాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో జరగనున్నాయి. ఇందుకోసం రెండు జిల్లాల అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.





ఖమ్మం ఖిల్లాపై ఎవరిదో జెండా!

● లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం ●

- శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు షురూ
- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు
- 13 నుంచి 21రౌండ్ల వరకు సాగనున్న ప్రక్రియ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్
- కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు
- జిల్లావ్యాప్తంగా 144వ సెక్షన్

ఖమ్మం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ పరిధిలో మొత్తం 1896 పోలింగ్ కేంద్రాల్లో 16,31,039 ఓట్లకు గాను 12,41,135 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజవర్గాల ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 115టేబుల్స్ ఏర్పాటు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో 13రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉండగా ఖమ్మం, పాలేరు, సత్తుపల్లిలో 21 రౌండ్ల వరకు కౌంటింగ్ జరిగే అవకాశం ఉంది. ఉదయం 5 గంటలకే కౌంటింగ్ సిబ్బందిని తనిఖీ చేసి కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించనున్నారు. 5 గంటలకే అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూంను తెరవనున్నారు.

మొత్తం 36మంది ఎన్నికల బరిలో ఉన్నందున 565 మంది ఏజెంట్లు కౌంటింగ్‌లో పాల్గొనబోతున్నారు. వీరిని కూడా ఉదయం 6 గంటల నుంచే పూర్తిస్థాయి తనిఖీ అనంతరం కౌంటింగ్ హాల్‌కు అనుమతించనున్నారు. ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4గంటల్లోగా పూర్తి ఫలితం వెలువడనుంది. మొత్తం కౌంటింగ్‌లో 1500 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

ఈసారి పోస్టల్ ఓట్లు కూడా 10,687 ఓట్లు రాగా, సర్వీసు ఓటర్లు 430మంది వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ ఓట్లకోసం ప్రత్యేకంగా టేబుళ్లను కౌంటింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. ఈవీఎంలను మొదటి నుంచి సీరియల్ క్రమంలో కౌంటింగ్‌కు తెచ్చి మొదటి రౌండ్ కౌంటింగ్ అనంతరం రెండోరౌండ్‌లో అదే వరుస క్రమంలో ఈవీఎంలను తీసుకురావడం జరుగుతుంది. ప్రతీ ఈవీఎంపై సీలు, సంతకం, పోలింగ్ బూత్‌లో మొత్తం ఓట్లు, పోలైన ఓట్లు సరిచూసుకున్న తర్వాత కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకుల సమక్షంలోనే సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ జరగనుంది.

ప్రతి కౌంటింగ్ హాల్‌లో ఏజెంట్లు కూర్చునేందుకు బల్లలు వేశారు. అలాగే ఈవీఎంలు , కౌంటింగ్ టేబుల్‌కు మధ్య పూర్తి రక్షణ మెష్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాల్‌లోనే సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు పంపేందుకు అవసరమైన ల్యాప్‌ట్యాప్‌లు, జిరాక్సుల సౌకర్యం కూడా కల్పించారు. కౌంటింగ్‌ను ఎన్నికల సంఘం సీసీ కెమేరాల ద్వారా పర్యవేక్షించనుంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రతి రౌండ్ నుంచి వచ్చిన ఓట్ల లెక్కింపును లోక్‌సభ పరిధిలో మొత్తం ఓట్లను లెక్కించి రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

మొత్తం ఓట్ల లెక్కింపు ఈవీఎంల ద్వారా పూర్తయిన తర్వాత 5 ఈవీఎంలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్పులను లాటరీ ద్వారా ఎంపిక చేసి లెక్కించనున్నారు. తద్వారా ఈవీఎం లెక్కింపులకు వీవీప్యాట్ స్లిప్పులకు సమానంగా ఉందా లేదా తేడాలున్నాయా అన్న విషయం తేటతెల్లం కానుంది. ఎన్నికల ఫలితాలను ఎప్పకటిప్పుడు తెలిపేందుకు ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం బస్టాండ్, పాతబస్టాండ్, రైల్వేస్టేషన్, వైరా మధిర బస్టాండ్లలోనూ ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ మహబూబాబాద్‌లో జరుగుతున్నందున ఆ జిల్లా అధికారయంత్రాగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

భారీ బందోబస్తు ఏర్పాట్లు

కౌంటింగ్‌ను పురస్కరించుకుని పోలీసు యంత్రాంగాం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. మూడంచెల వ్యవస్థతో కౌంటింగ్ హాల్‌వద్ద బందోబస్తు నియమించారు. ఖమ్మం సీపీ సునీల్‌దత్ పర్యవేక్షణలో మొత్తం 250 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. కౌంటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్లు, సిగరెట్‌పెట్టెలు, లిక్విడ్, వాటర్ బాటిల్స్, మందులను నిషేదించారు. కౌంటింగ్ సిబ్బందిని, ఏజెంట్లను పూర్తిస్థాయిలో తనిఖీచేసి అనుమతించబోతున్నారు. అలాగే జిల్లాలో మూడు ప్రత్యేక బలగాలు కూడా అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ఘర్షణలు తలెత్తితే వెంటనే నిలువరించేందుకు ఈ బలగాలు పనిచేస్తాయి. అలాగే జిల్లావ్యాప్తంగా 144సెక్షన్ విధించారు. అనుమతి లేని ర్యాలీలను నిషేధించారు.

తేలనున్న అభ్యర్థుల జాతకాలు

ఓట్ల రూపంలో ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల జాతకాలు మంగళవారం బయపడనున్నాయి. ఖమ్మం, మహబూబాబాద్ నూతన ఎంపీలు ఎవరనేది మధ్యాహ్నం కల్లా తేలనుంది. ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులు ఎవరికివారు ధీమాగా ఉన్నా.. అంతిమ ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురు చూసున్నారు. అధికార కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజారిటీకి దీటుగా ఫలితం ఉంటుందని అంచనా వేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్, సీపీఐ కూటమికి 7,33,293 ఓట్లు లభించగా.. బీఆర్‌ఎస్‌కు 4,67,631 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కాంగ్రెస్‌కు 2,66,162ఓట్ల ఆధిక్యత లభించింది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి 2,47,214 ఓట్లు లభించగా బీఆర్‌ఎస్‌కు 1,61,118 ఓట్లు లభించాయి. కాంగ్రెస్‌కు 86,096 ఓట్ల ఆధిక్యత లభించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఖమ్మం నుంచి రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ నుంచి పోరిక బలరాంనాయక్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంలో తమకు రెండున్నర నుంచి మూడు లక్షల మెజారిటీ వస్తుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక బీఆర్‌ఎస్ నుంచి ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో పోటీచేసిన నామా నాగేశ్వరరావు, మాలోతు కవితలు కూడా విజయం తమదేనన్న విశ్వాసంతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసినా.. లోక్‌సభ ఎన్నికల్లో తమకే వేశారని, స్వల్ప మెజారిటీతోనైనా గెలిచి తీరుతామన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థులుగా ఖమ్మం నుంచి తాండ్ర వినోదరావు, మహబూబాబాద్ నుంచి సీతారాంనాయక్‌లు కూడా గెలుపుపై ధీమాతో ఉన్నారు. మోదీ ప్రభావంతో తమకు ఓట్లు పడ్డాయని వారు ఆశిస్తున్నారు.



కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

7

ఉదయం 9 గంటల కల్లా
తొలిరౌండ్ ఫలితం
ఖమ్మానికి 18, మిగిలిన సెగ్మెంట్లకు 14 టేబుళ్లు..

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3: ఖమ్మం పార్లమెంట్ ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున కౌంటింగ్ సిబ్బందితో పాటు ఆర్వో, ఏఆర్వోలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒక్కో రౌండ్‌కు కనీసం 30 నిమిషాల వ్యవధి పడుతుంది. ఈ లెక్కప్రకారం తొలి రౌండ్ ఫలితం 8.50వరకు వెల్లడి అవుతుందని భావిస్తున్నారు. మొత్తం ఏడు సెగ్మెంట్లకుగాను ఖమ్మంలో 18 టేబుళ్లు, మిగిలిన ఆరు సెగ్మెంట్లలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ కథా కమామిషు..

సెగ్మెంట్	లెక్కించాల్సిన ఓట్లు	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్స్
ఖమ్మం	2,04,078	355	18	20
పాలేరు	2,01,721	290	14	21
మధిర	1,81,815	268	14	19
వైరా	1,56,762	252	14	18
సత్తుపల్లి	1,95,979	294	14	21
కొత్తగూడెం	1,71,928	253	14	18
అశ్వారావుపేట	1,28,852	184	14	13
పోస్టల్ బ్యాలెట్లు	10,687	-	14	2

మహబూబాబాద్‌లో ఏర్పాట్లు పూర్తి

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు



మహబూబాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహబూబాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్)లో మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభించనుండగా లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షణలో మూడెంచెల భద్రత మధ్య పూర్తిచేయనున్నారు. లెక్కింపు కేంద్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ రౌండ్‌కు 98 ఈవీఎంల లెక్కింపు కొనసాగుతుంది. రౌండ్ల వారీగా పరిశీలిస్తే.. ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 22 రౌండ్లలో లెక్కింపు జరగనుండగా.. మహబూబాబాద్, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 21 రౌండ్లచొప్పున లెక్కింపు జరుగుతుంది. డోర్నకల్ 19రౌండ్లు, ఇల్లెందు, పినపాక అసెంబ్లీలకు 18 రౌండ్లకు లెక్కింపు పూర్తవుతుంది. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మాత్రం 13 రౌండ్లకే పూర్తి కానుంది. మరోవైపు పోస్టల్ బ్యాలెట్‌లు, హోం ఓటింగ్‌కు సంబంధించి లెక్కించేందుకు ప్రత్యేకంగా 12 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలో తు కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్‌లు బరిలో నిలిచారు. మొత్తం 15,32,366 ఓట్లకు గాను 11,01,030 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని ములు గు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,809 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నిర్వహించారు.

ఏపీకి ఖమ్మం మద్యం కిక్కు

- రేపటి వరకు ఏపీలో మద్యం అమ్మకాలు నిషేధం
- ఎన్నికల ఫలితాల వేళ మద్యానికి పెరిగిన డిమాండ్
- ఉమ్మడి జిల్లా సరిహద్దుల నుంచి ఏపీకి మద్యం తరలింపు
- ఒక్కరోజే రికార్డుస్థాయిలో 13వేల కేసుల లిఫ్టింగ్
- మే నెలలో రూ.237.15 కోట్ల మద్యం విక్రయాలు
- ఎన్నికల ఎఫెక్ట్‌తో సర్కారుకు కాసుల పంట



ఖమ్మం సంక్షేమ విభాగం/వైరా, జూన్ 3: ఏపీలో ఏ రాజకీయ పార్టీ అభ్యర్థులు గెలిచినా సెలబ్రేషన్‌లో కిక్కు ఇచ్చేది ఉమ్మడి జిల్లా మద్యం మాత్రమే. అవును ఇది నిజం. ఏపీలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈనెల 3,4,5న మద్యం అమ్మకాలను నిషేధించారు. దీంతో ఏపీ సరిహద్దులోని ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సోమవారం నుంచి జోరుగా మద్యం రవాణా జరుగుతోంది. సాధారణంగా ప్రతి నెల మొదటి వారంలో ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు వైరా మద్యం డిపో నుంచి తక్కువగా మద్యం లిఫ్టింగ్ జరుగుతుంది. ఎందుకంటే గత నెలలో నిల్వ ఉంచిన మద్యాన్ని మొదటి రెండు వారాలు అమ్మకాలు జరిపి 15 తర్వాత మద్యాన్ని వైన్స్ దుకాణాలకు తరలిస్తుంటారు. అయితే ఎన్నికల సమయంలో మద్యం అమ్మకాలు తగ్గాయని మే 29, 30,31 తేదీల్లో ఒక్కో మద్యం దుకాణానికి రూ.50లక్షల మద్యాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు దగ్గరుండి పంపిణీ చేశారు. వాటిని అమ్మకం జరపటం ఎలా అని వైన్స్ నిర్వాహకులు ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రానికే మద్యం అమ్మకాలు ముగిశాయి. ఇక సోమవారం ఏపీ సరిహద్దులోని అశ్వారావుపేట, భద్రాచలం, సత్తుపల్లి, వీఎం బంజర, ఎర్రుపాలెం, మధిర గ్రామీణం, బోనకల్, వైరా, ఖమ్మం నగరానికి చెందిన వైన్స్ నిర్వాహకులు మొత్తం 13వేల వైన్స్ కేసులను కొనుగోలు చేసి వైరా మద్యం డిపో నుంచి తరలించారు. సాధారణ రోజుల్లో 3వ తేదీన 3వేల నుంచి 4వేల వైన్స్ కేసులు మాత్రమే అమ్మకాలు జరుగుతాయి. కానీ 13వేల కేసులు ఉమ్మడి జిల్లాలోని బోర్డర్ వైన్స్‌కు చేరటంతో **(మిగతా 6వ పేజీలో)**

ఉద్యోగాల పేరుతో
టోకరా

- డీఎంహెచ్‌వో, డీసీ సంతకాల ఫోర్జరీ
- ఆసుపత్రిలో శిక్షణ అంటూ నకిలీ ఆర్డర్లు
- నిందితులపై కేసు నమోదు

7

జిల్లా ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్ ప్రారంభం

- అత్యవసర రోగులకు రెండు గంటల్లోనే నివేదికలు

7

కబళించిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి



జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో జాతీయజెండాను, గులాబీజెండాను ఎగురవేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

తెలంగాణ సాధనలో
కేసీఆర్‌దే కీలక పాత్ర

- చరిత్రను చెరిపేసేందుకు కాంగ్రెస్ కుట్ర
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- బీఆర్‌ఎస్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావుతో కలిసి గులాబీజెండాను, అలాగే జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్‌దే ముఖ్యపాత్ర అని, ఆయన పోరాటంతోనే తెలంగాణ సాధించుకున్నామన్నారు. దీనిపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఖమ్మం జిల్లా ప్రజలు ఎంతో ఉద్యమస్ఫూర్తితో పోరాడారన్నారు.

తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్‌ను ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం బాధాకరమన్నారు. తెలంగాణలో కేసీఆర్ చరిత్రను చెరిపేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించడం కాంగ్రెస్ పార్టీ కోల్పోతున్న ప్రజాదరణకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బెల్లం వేణు, వీరునాయక్, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా తాతా మధుసూదన్, సండ్ర వెంకటవీరయ్య కేక్‌కట్ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఆశల సాగుకు సిద్ధం

- ముందే పలకరించిన వరుణుడు
- వానాకాలం పొలం పనులు షురూ..
- 6 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వరి తరువాత పత్తికే ప్రాధాన్యం
- పత్తిగింజలు విత్తుతున్న రైతులు
- విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో పెరిగిన రద్దీ

7

గత ఏడాది కాలం కలిసిరాక నష్టాలు మూటకట్టుకున్న రైతులు ఈసారి కొత్త ఆశలతో వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలకు అనుగుణంగా వర్షాలు ముందుగానే పలకరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మెట్టపంటల కోసం దుక్కులు చేసుకున్న రైతులు... సాగుకు కావాల్సిన విత్తనాలను సైతం సిద్ధం చేసుకున్నారు. వర్షాలు కూడా ప్రారంభం కావడంతో కొన్ని చోట్ల పత్తి విత్తనాలను విత్తుతున్నారు.

- ఖమ్మం వ్యవసాయం/మధిర



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3: ఖమ్మం లోక్‌సభ సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామని ప్రశాంత కౌంటింగ్ సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలం, పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కౌంటింగ్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంల కౌంటింగ్‌కు 7 కౌంటింగ్ హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ఒక హాల్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏ హాల్‌కి ఆ హాల్‌లో ఆయా సెగ్మెంట్ కౌంటింగ్ చేపట్టి, ప్రతి రౌండ్ ఫలితాలు ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రకటిస్తామన్నారు. తుది ఫలితాలు అన్ని అసెంబ్లీ, పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్ పూర్తయ్యాక ప్రకటిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్ ఒకేసారి ఉదయం 8గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఫలితాలు ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఖమ్మం కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్, సత్తుపల్లి, మధిర, వైరా బస్టాండ్లలో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఫలితాల సమాచారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఏజెంట్లు ఉదయం 6గంటలకే రావాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు స్ట్రాంగ్ రూంలు తెరవడానికి ఉదయం 5గంటలకల్లా రావాలని ఆయన కోరారు. పాసులు వెంట తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని చెప్పారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎం కదలికలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యాక డిక్లరేషన్, సర్టిఫికెట్ అందజేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ర్యాండంగా 5 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వీవీప్యాట్ల లెక్కింపు చేస్తామన్నారు. ఈవీఎంలను కలెక్టరేట్‌లోని గోడౌన్‌కు తరలించి భద్రపర్చనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల కోసం వైరా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాల ఈ ఫలితాలను వీక్షించేందుకు వైరా మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు ఆధ్వర్యంలో బస్టాండ్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను సోమవారం సాయంత్రం ఏర్పాటుచేశారు. - వైరా

ఏది అసలు? నకిలీ?



- ప్రభుత్వ పట్టాలపై ఇంటినెంబర్ కేటాయింపులో అయోమయం
- పట్టాలపై స్పష్టత ఇవ్వని రెవెన్యూ అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 3: ఖమ్మం నగరంలోని రామన్నపేటకు చెందిన ఒక వ్యక్తి తనకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాపై ఇంటినెంబర్ కోసం నగరపాలకసంస్థ కార్యాలయం లో దరఖాస్తు చేశాడు. అయితే తనకు ప్రభుత్వం స్థలం ఇచ్చిందని వేరు వ్యక్తి పట్టా తీసుకొని రావటంతో నగరపాలకసంస్థ అధికారులు అతడికి గతంలోనే ఇంటినెంబర్ కేటాయించటంతో తాజాగా దరఖాస్తు చేసిన వ్యక్తి లబోదిబోమంటూ తనకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇటువంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా నకిలీ పట్టాలను తయారు చేసి, ఇంటినెంబర్లు పొందేందుకు దరఖాస్తు చేస్తున్నారు. నగరపాలకసంస్థ అధికారులు ఎటువంటి విచారణ చేయకుండా ఇంటినెంబర్లు కేటాయించటంతో అసలైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తమదే అసలైన పట్టా అని పలువురు నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పుట్టుకొస్తున్న నకిలీలు..!

ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి పట్టాలు ఇస్తే, దాంట్లో ఏది అసలు, ఏది నకిలీ అన్న విషయంలో స్పష్టత లేకుండా పోతున్నది. నగరంలోని దానవాయిగూడెం, రామన్నపేట, వైఎస్సార్‌నగర్, బల్లేపల్లి, బాలపేట తదితర ప్రాంతాల్లో నకిలీ పట్టాలు పుట్టిస్తున్నారు. గతంలో ప్రభుత్వం స్థలాలు కేటాయించి, కొందరు పేదలకు పట్టాలు ఇచ్చింది. అయితే సదరు స్థలంలో వారు ఎటువంటి నిర్మాణాలు చేయకపోవటంతో వాటిని గమనించిన కొందరు అదే సర్వేనెంబర్‌తో నకిలీ పట్టాలు సృష్టిస్తున్నారు. వాటి ద్వారా ఇంటినెంబర్లు పొంది సదరు స్థలాలను విక్రయిస్తున్నారు. తరువాత నిర్మాణం చేసి, ఇంటినెంబర్ కోసం దరఖాస్తు చేసినవారు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తే అప్పటికే సదరు పట్టాభూమికి ఇంటినెంబర్ కేటాయించటంతో ఖంగుతింటున్నారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన పట్టాలు జారీ చేసినప్పుడు రెవెన్యూ అధికారులు వాటి జాబితాను నగరపాలకసంస్థ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. సదరు జాబితాను పంపాలని స్వయంగా కమిషనర్ లేఖ రాసినా పట్టించుకోవటంలేదు. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన పట్టా ద్వారా ఇంటినెంబర్‌కు దరఖాస్తు చేస్తే, సదరు పట్టా నిజమైనదేనా? అన్న విషయంపై రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే తమ వద్ద వివరాలు లేవని సమాధానం చెబుతున్నారు. దీంతో అక్రమార్కులు తయారు చేయించే పట్టాలపై విచారణ చేసే అవకాశం లేకుండా పోతోంది.

ఇంటినెంబర్ల కేటాయింపుతో..

ఎవరైనా లబ్ధిదారుడు తన పట్టా పట్టుకొని వస్తే విచారణ చేయకుండానే ఇంటినెంబర్లు కేటాయించటంతో సమస్య వస్తోంది. తరువాత అదే నెంబర్‌తో మళ్లీ పట్టా తీసుకువస్తే వివాదం మొదలవుతోంది. రెవెన్యూ కార్యాలయంలో మీరే తేల్చుకోండి అని నగరపాలకసంస్థ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం జారీ చేసిన పట్టాల వివరాలు నగరపాలకసంస్థ అధికారులకు పంపిస్తే నకిలీ పట్టాల వ్యవహారానికి చెక్ పడుతుంది.

ఏపీకి ఖమ్మం మద్యం కిక్కు

(5వ పేజీ తరువాయి)

ఏపీ సెలబ్రేషన్‌లో ఖమ్మం మద్యం కిక్ ఇవ్వనుంది. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కారణంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం ఉమ్మడి జిల్లాలోని మద్యం దకాణాలకు సెలవు ప్రకటించారు. అయితే మద్యం దుకాణాల ఎదుట 04.06.2024న వైన్స్ బంద్ అని బోర్డును పెట్టి మద్యం ప్రియులకు అవగాహన కల్పించారు. ఒక రోజు ముందుగానే ముందస్తు మద్యం అమ్మకాలు జరిపారు.

ఏప్రిల్, మే నెలల్లో జోరు..

ఎంపీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత అనేక కఠిన నిబంధనల్లో కూడా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గడిచిన ఏప్రిల్, మే నెలల్లో మద్యం విక్రయాలు పెరిగాయి. ఈ నిబంధనలు లేనట్లయితే ఈ మద్యం విక్రయాలు నాలుగురెట్లు పెరిగేవి. గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కంటే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 39.55కోట్ల మద్యం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 210వైన్‌షాపులు, 50బార్లు, మూడు క్లబ్‌లున్నాయి. ఓ వైపు ఎన్నికల కోడ్, వైన్‌షాపులకు మద్యం సరఫరా నిబంధనలు, రేషన్ పద్దతిలో మద్యం సరఫరా, బెల్టుషాపులు పూర్తిగా బంద్, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పూర్తిగా నాలుగురోజులు మద్యం విక్రయాల బంద్ తీవ్ర బీర్ల కొరత వంటి అనేక సమస్యలున్నప్పటికీ మే నెలలో జరిగిన లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలు మద్యం విక్రయాల పెరుగుదలకు దోహదపడ్డాయి. ఏపీలోని ఎన్నికల వలన ఆయా రాజకీయ పార్టీలు తెలంగాణ మద్యాన్ని అడ్డదారుల్లో తరలించుకుపోవడంతో మద్యం విక్రయాలు పెరిగాయని పలువురు భావిస్తున్నారు.



ఈ ఏడాది మే 31వతేదీ ఒక్కరోజే రూ.11.37కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అదేరోజు మద్యం పెట్టెలు 14,672, బీరుపెట్టెలు 5,187సరఫరా చేశారు. ఈ ఏడాది మేనెల మొత్తం మీద రూ.237.15కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. వీటిలో మద్యం పెట్టెలు 3,03,499కాగా, బీరుపెట్టెలు 1,98,468 ఉన్నాయి. గత ఏడాది మేలో మొత్తం మద్యం విక్రయాలు రూ.219.91కోట్లు అంటే గత ఏడాది కంటే ఈ ఏడాది మేలో రూ.17.24కోట్ల మద్యం విక్రయాలు పెరిగాయి. గత మేలో మద్యంపెట్టెలు 2,72,219కాగా, బీరుపెట్టెలు 2,75,809గా ఉన్నాయి. గత మే కంటే ఈ మేలో మద్యం పెట్టెలు 31,280అదనంగా సరఫరా చేయగా, బీరుపెట్టెలు మాత్రం గత మే కంటే ఈ మేలో 77,341తక్కువగా సరఫరా చేశారు. గత ఏడాదే బీరుపెట్టెలు అధికంగా విక్రయించారు. ఇక పోతే ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.181.21కోట్ల మద్యం విక్రయాలు జరుగగా గత ఏప్రిల్‌లో రూ.158.90కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అంటే ఈ ఏప్రిల్‌లో రూ.22.31కోట్ల మద్యం విక్రయాలు అదనంగా జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో మద్యం పెట్టెలు 2,13,172కాగా బీరుపెట్టెలు 2,25,739, గత ఏడాది ఏప్రిల్‌లో మద్యం పెట్టెలు 1,81,744కాగా, బీరుపెట్టెలు 1,78,200 సరఫరా చేశారు. గత ఏడాది ఏప్రిల్ కంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో మద్యం పెట్టెలు 31,428, బీరు పెట్టెలు 47,539సరఫరా చేశారు. ఈవిధంగా ఈ రెండునెలల్లో మద్యం విక్రయాలు జరిగాయి.



మంత్రి పొంగులేటికి వినతిపత్రమిస్తున్న బౌద్ధ భిక్షువు పూజ సర్ధార్‌కిట

బౌద్ధ స్థూపం అభివృద్ధికి సహకరించండి

పొంగులేటికి వినతిపత్రం ఇచ్చిన బౌద్ధ భిక్షువు

నేలకొండపల్లి, జూన్ 3: నేలకొండపల్లి మహా బౌద్ధస్థూపం అభివృద్ధికి సహకరించాలని హైదరాబాద్ దమ్మ పదవిహార్ డైరెక్టర్, బౌద్ధ భిక్షువు పూజ సర్ధార్‌కిట మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేశారు. సోమవారం నేలకొండపల్లి పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటికి బౌద్ధ భిక్షువు వినతి పత్రం ఇచ్చారు. కొత్తకొత్తూరులో మంత్రిని కలిసిన బౌద్ధ భిక్షువు మంత్రికి శాలువా కప్పి, బుద్ధుని బోధనలు అనే గ్రంథం ఇచ్చి సత్కరించారు. బౌద్ధ స్థూపాన్ని సందర్శించటానికి వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కల్పించాలని కోరారు. అంతుకు ముందు కొత్తకొత్తూరులోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

ఉపాధికి బాటలు వేస్తున్న మహిళలను ప్రోత్సహించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



స్టాల్‌ను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, జూన్ 3: గిరిజన మహిళలు చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని పది మందికి ఉపాధి కల్పిస్తున్న మహిళలకు ప్రతి ఒక్కరు చేయూతనందించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా చిన్నతరహా పరిశ్రమ నెలకొల్పిన ఆదివాసీ మహిళలు వారే సొంతంగా తయారు చేసిన ఆరు రకాల సబ్బులు షాంపూలు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ప్రజలకు విక్రయించడానికి అవకాశం ఇచ్చామన్నారు. వారు తయారు చేసిన వస్తువులు ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి వారి జీవన భృతికి తోడ్పాటునందించాలని కోరారు. ఓం శక్తి మహిళ గ్రూపు సభ్యులు తయారు చేసే సెంటు, ఫినాయిల్, కొవ్వొత్తులు, సర్ఫ్ ప్యాకెట్లు విక్రయిస్తున్న వారికి చేయూతనందించాలన్నారు. అనంతరం వారు తయారు చేసిన సబ్బులు, షాంపూలు, ఇతర వస్తువులను ఆయన కొనుగోలు చేశారు. ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే నిరుపేద గిరిజనులకు సరసమైన ధరలకు అందించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌కు లిఖిత్



పాల్వంచ, జూన్ 3: జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన లిఖిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరిచిన లిఖిత్‌ను కోచ్‌లు అభినందించగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ నెల 1,2వ తేదీల్లో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని టీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో లిఖిత్ విజేతగా నిలిచాడు. అండర్ -15 బాలుర సింగిల్స్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీ తలపడి ద్వితీయ స్థానం సాధించాడు. అండర్ -15 బాలుర డబుల్స్ అండర్-17 డబుల్స్ విభాగాల్లో తన భాగస్వామి నోయల్‌తో కలిసి అద్భుతంగా ఆడి విజేతగా నిలిచాడు.

పాలీసెట్ ఫలితాల విడుదల

- 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్

చుంచుపల్లి, జూన్ 3: పాలిటెక్నిక్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన పాలీసెట్ -2024 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గత నెల మే 24వ తేదీన నిర్వహించిన ఈ పాలీసెట్ పరీక్షకు భద్రాద్రి జిల్లాలో 2,828 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని జిల్లా పాలీసెట్ కన్వీనర్ నాగముని నాయక్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. 24వ తేదీ వరకు ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ నమోదు చేసుకోవాలన్నారు. 27వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు సీటు పొందిన కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. సీట్లు రాని అభ్యర్థులు వచ్చే నెల జూలై 7వ తేదీన జరిగే 2వ పాలిసెట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం టిజిపాలిసెట్.ఎస్‌బిటి.ఇఎన్ ను అనుసరించాలని అన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకారం

- నిత్యాన్నదానం, శాశ్వత పూజలకు రూ.లక్ష విరాళం

భద్రాచలం, జూన్ 3: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించగా 41 జంటలు పాల్గొన్నాయి. దేవస్థానం నిత్యాన్నదానం, శాశ్వత పూజల నిమిత్తం ఏపీలోని రాయచోటి గ్రామానికి చెందిన ఎం.సుబ్రహ్మణ్యం దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు..

- కలెక్టర్ ప్రియాంక అల

పాల్వంచ రూరల్, జూన్ 3: పాఠశాలల అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల హెచ్చరించారు. సోమవారం మండలంలోని తోగ్గూడెం, మాదారం, సోములగూడెం గ్రామపంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. పాఠశాలల అభ్విద్ధి పనులను తనిఖీ చేశారు. తోగ్గూడెంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులను నత్తనకడన నడుస్తుండ టంతో హెచ్చరించారు. పలు చోట్ల తనిఖీ చేసి ఆమె అధికారుల తో మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభంలోపు పనులనున్నీ పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండ చూడాలన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలల కొరవడిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

విత్తనదుకాణాలు తనిఖీ..

పాల్వంచలోని విత్తన దుకాణాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక అల తనిఖీ చేసి విక్రయాల రికార్డులను పరిశీలించారు. స్టాక్‌వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందచేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ, పోలీస్ శాఖల ఉమ్మడి తనిఖీ చేసి పరిశీలించాలని ఆదేశించారు. ఆమె వెంట వ్యవసాయశాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



తోగ్గూడెం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక అలా



ట్రేడ్ దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- విత్తనాలకు ఎలాంటి కొరత లేదు

కొత్తగూడెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు ఏసిన 564 అవుట్‌లెట్స్ కేంద్రాల ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల కోరారు. సోమవారం ఆమె పాల్వంచ పట్టణంలోని కిన్నెరసాని రోడ్డులో శ్రీ శ్రీ లక్ష్మీగణపతి ట్రేడ్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ దుకాణంలో ఉన్న వివిధ రకాల విత్తనాలు, ఫెర్టిలైజర్ నిల్వలు, రిజిస్టరు, రికర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విత్తనాలకు ఎలాంత కొరత లేదని, అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సుమారు 4,47411 ప్యాకెట్లు పత్తి విత్తనం జిల్లాలో అందుబాటులో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 564 ఆథరైడ్డ్ అవుట్‌టెట్లు ఉన్నాయని వీటి ద్వారా ప్యాకేజీ విత్తనాలను కొనాలని అన్నారు. ప్యాక్ చేసిన విత్తనాలు మాత్రమే కొనాలని, లూజు విత్తనాలు, సీల్ తీసిన విత్తనాలు కొనవద్దని అన్నారు. ఇలాంటి వాటి వల్ల దిగుబడి తక్కువగా రావడం, విత్తనం మొలకెత్తకపోవడం వంటి సమస్యలు తలెత్తేతే అవకాశం ఉందని చెప్పారు. వరి, పత్తి, పిచ్చి, రొట్టె ఎరువులు అందుబాటులో ఉన్నాయి అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పాల్వంచ తహసిల్దార్ వివేక్, సంబంధిత అధికారులు తదితులు పాల్గొన్నారు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- ప్రత్యేక కార్యాచరణకు నిర్ణయం
- ఇతర జిల్లాల పోలీసులతో సమన్వయం
- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిలాలలో గంజాయి అక్రమ రవాణాను నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గంజాయి అక్రమ రవాణాను నిర్మూలించేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. సరిహద్దులో ఉన్న ఇతర జిల్లాల రాష్ట్రాల పోలీస్ అధికారులతో సమన్వయం పాటిస్తూ సమాచారాన్ని సేకరించి గంజాయి రవాణాను పూర్తి అరికట్టాలని సూచించారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులకు త్వరితగతిన శిక్షణ పడేలా కృషి చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని అక్రమార్కులు తరలించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. గంజాయి అక్రమ రవాణా గురించి ఎవరికైన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్నఎస్పీ రోహిత్‌రాజ్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

తెలంగాణ అమరుడి మాతృమూర్తి కన్నుమూత

చుంచుపల్లి, జూన్3: తెలంగాణ అమరవీరుడు పోలీసుల కాల్పుల్లో 1969లో తనువు చాలించిన రాంచందర్ తల్లి శారమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వారి స్వగృహమైన విద్యానగర్ కాలనీలో పార్థీవ దేహానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి నివాళ్లు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్, స్థానికులు సాయి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

ఇల్లెందు టౌన్, మే 3: కమ్యూనిస్టుల ఆశయ మార్గం కఠినంగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య తెలిపారు. సోమవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే సీపీఎం లక్ష్యమని ప్రకటించారు. పార్టీ విస్తీరణ లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. భారత సమాజాన్ని కమ్యూనిస్టు ఆశయం మార్చాలని పేర్కొన్నారు. ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నా.. లక్ష్యం సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు. ఆకలి చావులు, మనిషి మనిషిని దోచుకునే స్వరూపం, రైతు ఆత్మహత్యల, కార్పొరేట్ దోపిడీ, దుష్ట రాజకీయల లాంటివి కమ్యూనిస్టు పార్టీలో ఉండవన్నారు. చైనా, క్యూబా, వియత్నాం కమ్యూనిస్టు పాలనలో ఉన్నాయని తెలిపారు. గత పదేళ్లుగా కేరళ రాష్ట్రాన్ని సీపీఎం పాలిస్తుందని అభివృద్ధి దిశగా దేశంలోనే నెంబర్-1 రాష్ట్రంగా నిలిచిందన్నారు. మార్క్సిజమే అజేయంగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమశిక్షణ తరగతుల్లో రాష్ట్ర నాయకులు ఏజే. రమేష్, మండల కార్యదర్శి అబ్దుల్ నబీ, అలేటి కిరణ్‌కుమార్, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, సంధ్య, సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

ఆశల సాగుకు సిద్ధం

- ముందే పలకరించిన వరుణుడు
- చిరు జల్లులతో వానాకాలం పొలం పనులు షురూ..
- జిల్లాలో సుమారు 6 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వరి తరువాత పత్తికే ప్రాధాన్యం
- పత్తిగింజలు విత్తుతున్నరైతులు
- విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో పెరిగిన రద్దీ



పొలం దుక్కి దున్నుతున్న రైతు

ఖమ్మం వ్యవసాయం/మధిర, జూన్ 3: గత ఏడాది ఉసూరుమనిపించిన వానాకాలం సీజన్ కొత్త ఆశలతో మళ్లీ రైతుల ముందుకు కొచ్చింది. రైతులు సాగుకోసం సన్నద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్ జూన్ 1న ప్రారంభమై సెప్టెంబరుతో ముగుస్తుంది. జిల్లాలో ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు పొలం పనులు ప్రారంభించారు. ఇప్పటికే పొడి దుక్కులు ప్రాంభించిన రైతులు ఇక విత్తనాలు నాటే పనులు ప్రారంభించనున్నారు. గత ఏడాది వానాకాలంలో సాధారణ సాగు 5,81,687 ఎకరాలుండగా, ఈ ఏడాది 5,96,662ల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో వరి 2,83,943 ఎకరాలు, మిర్చి 88,906ఎకరాలు, పత్తి 2,01,834 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసింది. విగిలినవి అపరాలు ఇతర పంటలు ఉన్నాయి. మొత్తంగా గత వానాకాలం సీజన్‌కంటే ఈ సవంత్సరం సాగు విస్తీర్ణం పెరగనుందని అంచనా వేశారు.

విత్తనాలు, ఎరువుల కోసం పరుగులు..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి వర్షం కురవడంతో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం పరుగులు పెడుతున్నారు. మధిర, సత్తుపల్లి, వైరా, కూసుమంచి ప్రాంతాల నుంచి అన్నదాతలు ఆయా మండల కేంద్రాలతో పాటు ఖమ్మం వచ్చి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తనాల, ఎరువుల దుకాణాలలో రద్దీ పెరిగింది. కొంతమంది రైతులు ఇప్పటికే తమ పొలాల్లో కోళ్ల, ఆవు పేడ వంటి సేంద్రియ ఎరువులను చల్లారు. వరిసాగు చేసే రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట జల్లారు. వరి నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు.

విత్తనాలు సిద్ధం..

జిల్లాలో రైతుల సాగుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) విజయనిర్మల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో పచ్చిరొట్ట, పిల్లి పెసర, జీలుగు విత్తనాలు నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది 21,276 క్వింటాళ్లు అవసరం కాగా ఇప్పటికే 14,167 క్వింటాళ్లను సొసైటీల్లో అందుబాటులో ఉంచారు. 60 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు మరో 10 వేల క్వింటాళ్లు తెప్పించేందుకు ఇండెంట్ పంపారు. ఇక 2,01,900 ఎకరాలకు సరిపడా పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. వరి విత్తనాలు 70,986 క్వింటాళ్లు, మొక్కజొన్న 135 క్వింటాళ్లు, కంది 80 క్వింటాళ్లు, పత్తి 5,50,000 ప్యాకెట్లు, పెసర 1,229 క్వింటాళ్లు, మినుములు 35 క్వింటాళ్లు, వేరుశనగ 243 క్వింటాళ్లు, మిరప 90 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

సాగుకు అగుణంగా ఎరువులు

ఇక సాగుకు అవసరమైన ఎరువల అంచనాలను కూడా వ్యవసాశాఖ సిద్ధం చేసింది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న ఎరువులతోపాటు మిగిలిన ఎరువులను సైతం సకాలంలో ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు చేరవేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ సీజన్ మొత్తానికి(ఆరు నెలలకు సరిపడా) సుమారు 2,87,327 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయన అంచనా వేశారు. అందులో యూరియా 83,663 మెట్రిక్ టన్నులు, డీఏపీ 35,646 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 26,724 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1,38,014 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ ఎరువులు 2,580 మెట్రిక్ టన్నులు, సిటీ కంపోస్టు 1,200 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశారు.

విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయి

- విజయనిర్మల, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో వానాకాలం సీజన్ అవసరాలకు సరిపడా విత్తనాలు, ఎరువులు సంమృద్ధిగా ఉన్నాయి. రైతులు విత్తనాలకోసం, ఎరువుల కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నకిలీ వ్యాపారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నాసీరకం విత్తనాలు కొనుగోలు చేసి మోపోద్దు. ఎవరైనా లైసెన్స్‌లేకుండా విత్తనాలు గ్రామాల కొచ్చి విక్రయిస్తే వెంటనే పోలీసులకు, స్థానిక అధికారులకు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ కలిగిన డీలర్లవద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి బిల్లులు తప్పకుండా తీసుకోవాలి.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, జూన్ 3: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో సోమవారం మంత్రి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ తనకు భారీ మెజారిటీతో గెలిపించిన పాలేరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని పాలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి మంచి మెజార్టీ వస్తుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి భద్రయ్య, వేగినాటి లక్ష్మీనర్సయ్య, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, మైసా శంకర్, కొడాలి గోవిందరావు, బొడ్డు బొందయ్య, కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు: సీపీ

ఖమ్మంక్రైం, జూన్3: సోషల్ మీడియా వేదికగా మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవలే తల్లాడ ప్రాంతానికి చెందిన ఓయువతి సోషల్ మీడియా ద్వారా ఓవ్యక్తి స్నేహంగా ఉంటూ డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేయడంతో సదరు యువతి షీటీంను ఆశ్రయించింది. దీంతో నిందితుడిపై తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసినట్టు సీపీ తెలిపారు. బాధిత మహిళలు నిర్భయంగా షీటీం నెంబరు 871216 59222 నందు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈఏడాది మేనెలలో 13ఫిర్యాదుల వచ్చాయని, ఇందులో 3 ఎఫ్ఐఆర్‌లు చేయగా, మరో 3 పెట్టీ కేసులుగా నమోదు చేసినట్టు సీపీ తెలిపారు. అదేవిధంగా మరో ఐదుగురికి కౌన్సెలింగ్ ఇచ్చామని, సీపీ ప్రకటనలో తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్ ప్రారంభం

- అత్యవసర రోగులకు రెండు గంటల్లోనే నివేదికలు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మెడికల్ కళాశాల రెండో ఏడాది తరగతులకు అనుమతులు వచ్చిన సమయంలో విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు, ఆస్పత్రికి వచ్చే అత్యవసర రోగులకు వివిధ రకాల పరీక్షలను రెండు గంటల్లో అందించే లక్ష్యంతో ఈ సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని సోమవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి ప్రారంభించారు. మెడికల్ కళాశాలకు ఎంబీబీఎస్ రెండో సంవత్సరానికి ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో సెప్టెంబర్ నాటికి రెండో ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులకు సెంట్రల్ ల్యాబ్ ఆవశ్యకత ఉంటుంది.

ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో రోగుల నుంచి సేకరిస్తున్న రక్తనమూనాలను టీహబ్‌లో పరీక్షిస్తున్నారు. ఇది వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తుంది. దీనికి తోడు అత్యవసర సమయంలో ఆపరేషన్లు చేయాలన్నా, అవసరం ఉన్న రోగులకు పరీక్షల ఫలితాలు కావాలన్నా టీ హబ్‌లో 24 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటుతో రెండు గంటల్లోనే నివేదికలు వచ్చే ఆస్కారం ఉంది. ఇక్కడ సుమారు 70 రకాల పరీక్షలను రెండు గంటల్లో అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, సెంట్రల్ ల్యాబ్ ఇన్‌చార్జి డాక్టర్ రమాదేవి, ఎంసీహెచ్ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ బాబూ రత్నాకర్, ఆర్ఎంవోలు డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ రాంబాబు, పాథాలజిస్ట్ డాక్టర్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

- ఖమ్మం డీఎంహెచ్‌వో, డిప్యూటీ కమిషనర్ సంతకాల పోర్జరీ
- ఆసుపత్రిలో శిక్షణ అంటూ నకిలీ ఆర్డర్లు
- ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో వెలుగు చేసిన ఘరానా మోసం
- నిందితులపై కేసు నమోదు



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విచారిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3: ఏకంగా వైద్యవిధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి మాలతి సంతకాలను పోర్జరీ చేసి ఓ ముఠా ఉద్యోగ నియామక పత్రాలను అందించి అడ్డంగా పట్టుబడింది. నిరుద్యోగులను నమ్మబలికేలా ఆసుపత్రిలో మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకుంటే పూర్తిస్థాయిలో ఉద్యోగం లభిస్తుందని నలుగురు నిరుద్యోగులను మోసం చేసిన ఘటన ఖమ్మం జిల్లా జనరల్ ఆసుపత్రిలో జరిగింది. ఈ వ్యవహారంపై జిల్లా ఆసుపత్రి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన విజయగిరి శ్రీనివాస్, కొత్తపల్లి సత్యనారాయణ అనే వ్యక్తులు గత కొద్దిరోజులుగా ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో సూపర్‌వైజర్ పోస్టులున్నాయని నిరోద్యోగులను నమ్మబలికారు.

మూడు లక్షలు ఇస్తే ఆ ఉద్యోగాలు మీ సొంతం చేస్తామని వారితో బేరసారాలు సాగించారు. వీరిని నమ్మిన నీలం శ్రీలత, కిరణ్‌బాబు, ఎండీ ఆశ్రిఫ్ అనే వ్యక్తులకు మాయగాళ్లు నకిలీ ఆర్డర్లను తయారు చేశారు. వీటిపై వైద్య విధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ బి.మాలతి సంతకాలను పోర్జరీ చేసి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్లను తయారు చేసి వారికి ఇచ్చారు. అంతే కాకుండా ఆ నియామకపు పత్రాలు తీసుకుని వెళితే జిల్లా ఆసుపత్రిలోని కార్డియాక్ విభాగంలో మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆ తరువాత ఆ ముగ్గురు నిరుద్యోగులను విజయగిరి శ్రీనివాస్, కొత్తపల్లి సత్యనారాయణలు సోమవారం జిల్లా ఆసుపత్రిలోని కార్డియాక్ విభాగానికి తీసుకొచ్చారు.

అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న నందగిరి శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర వినయ్‌కుమార్ నిరుద్యోగులకు మాయగాళ్లు చెబుతున్న మాటలు విని అనుమానం రావడంతో పట్టుకుని ప్రశ్నించారు. "ఎంటీ ఇక్కడేం శిక్షణ ఇస్తున్నారు.. మీరెవరు" అంటూ నిలదీయడంతో అసలు విషయం బయటికి వచ్చింది. దీంతో ఆ ముగ్గురు నిరుద్యోగులను పట్టుకుని విషయాన్ని రాబట్టారు. ఆసుపత్రిలో సూపర్‌వైజర్ పోస్టుల కోసం రూ.3లక్షలు ఇస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ప్రస్తుతం నియామకపు పత్రాలు ఇచ్చి శిక్షణ ఉందని తీసుకొచ్చారని తెలిపారు. దీంతో వారికి ఇచ్చిన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను పరిశీలించి విషయాన్ని డీఎంహెచ్‌వో మాలతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే డీఎంహెచ్‌వో డాక్టర్ బి మాలతి, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆ నిరుద్యోగులతో మాట్లాడారు.

వారికి ఇచ్చిన ఆర్డర్ కాపీలను పరిశీలించారు. తమ సంతకాన్ని పోర్జరీ చేశారని తెలుసుకుని అవాక్కయ్యారు. తరువాత ఆ నిరుద్యోగులను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్టు, రెగ్యులర్ ఉద్యోగాలు ఉన్నాయంటూ మధ్యవర్తులు చెప్పే మాటలను నమ్మొద్దని ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లా ఆసుపత్రిలో అధికారులకు తెలియకుండా మధ్యవర్తులు శిక్షణ పేరుతో తీసుకొచ్చి ఆసుపత్రిలో కలియతిరగడం అధికారులను విస్మయానికి గురిచేసింది. నిందితులు విజయగిరి శ్రీనివాస్, కొత్తపల్లి సత్యనారాయణపై డీఎంహెచ్‌వో డాక్టర్ బి మాలతి, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖమ్మం పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్ జి కోల్టే, కౌంటింగ్ పరిశీలకుడు ప్రేదిమాన్ కృషన్ భట్‌లతో కలిసి పరిశీలించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హాల్, ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ హాళ్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ సెగ్మెంట్‌ల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ విధుల నిర్వహణకు ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో పరిశీలకులు ఏర్పాటు చేశామని తెలిపారు.

మంగళవారం ఉదయం 8 గంటలకు అన్ని కౌంటింగ్ హాళ్లలో కౌంటింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి. సత్యప్రసాద్, వేణుగోపాల్, ఎం.రాజేశ్వరి, జి. గణేష్, ఎల్. రాజేందర్, మధు ఆయన వెంట ఉన్నారు.


మద్యం మత్తులో ఘర్షణ..వ్యక్తి మృతి



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ రెహమాన్ (ఇన్‌సెట్‌లో మృతుడు నాగేంద్రబాబు)

బోనకల్, జూన్ 3: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు చేసిన దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బోనకల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం వేములనర్వ గ్రామానికి చెందిన ఉయ్యాల నాగేంద్రబాబు(26) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఏడాది గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం, చల్లగరిక గ్రామానికి చెందిన నాగసత్యతో వివాహమైంది. అత్తమామల ఇంటి వద్దనే ఉంటూ, ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు నెల క్రితం స్వగ్రామమైన వేములనర్వ గ్రామానికి వచ్చాడు. ఆదివారం సరిహద్దు గ్రామమైన బోనకల్‌కు మద్యం సేవించడానికి గానూ వైన్‌షాపునకు వెళ్లాడు. బీర్లు తీసుకొని సేవించి ఒక సీసా పగులకొట్టాడు. తనలో తాను ఏడ్చుకుంటూ ఉండటాన్ని అందరూ చూస్తున్నారు. దగ్గరలో మద్యం సేవిస్తున్న బోనకల్‌కు చెందిన మోర్ల పరుశురామ్, బొబ్బిళ్ల ఉపేందర్‌లు తమ పై పడిన పగిలిన సీసా ముక్కల గురించి అడిగారు. ముగ్గురు మద్యం మత్తులో ఉండటంతో వారి మధ్య ఘర్షణ తలెత్తింది. నాగేంద్రబాబు పై విచక్షణ రహితంగా ఇరువురూ దాడి చేశారు. స్థానికులు వారిని విడిపించడంతో అతడు ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులో పడిపోయాడు. అతడిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి తీసుకెళ్లారు. మద్యం మత్తులో ఉండటంతో జరిగిన విషయం గురించి వారికి చెప్పలేక పోయాడు. కాగా అర్ధరాత్రి ఒక్కసారిగా గురక రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉంది. జరిగిన ఘటన పై మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బోనకల్‌లో సంఘటనా స్థలాన్ని వైరా ఏసీపీ అబ్దుల్ రెహమాన్, సీఐ మధు, ఎస్ఐ మధుబాబులు సందర్శించి విచారణ నిర్వహించారు. ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భద్రాచలం, జూన్ 3: భద్రాచలంలోని రెవెన్యూ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెం దినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అం దించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటాయని, నేవీ బ్లూ కలర్ ప్యాంటు, యాష్ కలర్ చొక్కా ధరిం చి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఫొటోలో ఉన్న అతడిని గుర్తు పట్టిన వారు 87126 82106 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కుటుంబ కలహాలతో కార్పెంటర్ ఆత్మహత్య

పాల్వంచ, జూన్3: కుటుంబ కలహాలతో కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని వెంగళరావు కాలనీకి చెందిన నాగ ప్రసాద్(33) స్థానికంగా కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో తరచూ కుటుంబ సభ్యులతో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

బెండాలపాడు ఆలయంలో చోరీ

చంద్రుగొండ, జూన్ 3: మండల పరిధిలోని బెండాలపాడు శ్రీ భక్తంజనేయ స్వామి ఆలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చొరబడి హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులకు హుండీ పగులగొట్టి ఉండడాన్ని గమనించి, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. చోరీ విషయమై ఆలయ చైర్మన్ బొర్రా సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

త్రికుట దేవాలయంలో..

చర్ల, జూన్ 3: మండల కేంద్రంలోని త్రికుట దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీలోని నగదు, వెండితో తయారు చేసిన కిరీటాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన అర్చకులకు గుడి తలుపులు పగులగొట్టిన ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజువర్మ, ఎస్ఐలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వీటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది.

గొర్రెల పంపిణీకి గ్రహణం

- రెండేళ్లు గడిచినా అందని యూనిట్లు
- మూలధనం వాటా చెల్లించాలని దరఖాస్తు చేసుకుంటున్న బాధితులు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పథకం



మూలధనం వాటా నగదును తిరిగి ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

కల్లూరు, జూన్ 3: కురమ, గొల్ల సామాజిక వర్గాల వారి అభ్యున్నతి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ముందుకు సాగక గ్రహణం పట్టింది. ఈ పథకం ద్వారా కల్లూరు మండలంలో గత మూడేళ్ల క్రితం మొదటి విడతగా 674 మంది కురమ, గొల్ల సామాజిక వర్గాల లబ్ధిదారులకు 674 యూనిట్లు అందించారు. రెండో విడత గాను ప్రభత్వం రూ. 1.75 లక్షలు అంచనాతో కూడిన యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు సగటున ఒక లబ్ధిదారునికి అందిస్తారు. అందుకు గాను మూలధనం వాటాగా లబ్ధిదారుడు ప్రభుత్వానికి రూ.43,750 బ్యాంకు ద్వారా జిల్లా కలెక్టర్ ఖాతాలో డీడీ రూపంలో చెల్లించారు. ఇక రెండో విడతగా కల్లూరు మండలంలో 580 మంది కురమ, గొల్ల లబ్ధిదారులను ప్రభుత్వ అధికారులు గుర్తించారు. ఆ ప్రకారం సదరు యూనిట్లు పొందేందుకు గాను మూలధనం వాటాగా సగటున ఒక లబ్ధిదారుడు రూ. 43,750 బ్యాంకు ద్వారా కలెక్టర్ ఖాతాలో జమ చేశారు. అంత వరకు బాగానే ఉంది. సదరు మూలధనం వాటా నగదును పలువురు లబ్ధిదారులు వడ్డీతో అప్పులు చేసి నగదును బ్యాంకులో జమ చేశామని బాధితులు తెలిపారు. కాని గత ప్రభత్వం ద్వారా యూని ట్లు అందుతాయని ఎంతో ఆశతో ఎదురు చూసిన కురమ, గొల్ల సామాజిక వర్గ బాధితులకు రెండేళ్లు గడిచినా చివరకు నిరాశే ఎదురైంది. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వ మారడంతో ఈ పథకం ముందుకు సాగని పరిస్థితి. దీంతో కురమ, గొల్ల వృత్తి పరంగా జీవనం సాగిస్తున్న లబ్ధిదారులు ఇక ఈ పథకం ద్వారా యూనిట్లు అందే పరిస్థితి లేదని భావించి తమ మూలధనం వాటా నగదును తిరిగి చెల్లించాలంటూ ఇటీవల కల్లూరు మండల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలుసుకోని విజ్ఞప్తి చేయగా, ఆయన స్పందించారు. సదరు మూలధనం వాటా నగదును బ్యాంకులో జమ చేసిన వారందరికీ తిరిగి ఇచ్చేయాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారని తెలిసింది. ఆ క్రమంలో రెండో విడత గొర్రెల యూనిట్ల పథకానికి నోచుకోని లబ్ధిదారులు గత్యంతరం లేక తమ మూల ధనం వాటా నగదును వాపస్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటికే మండలంలోని కల్లూరు, బత్తులపల్లి, లింగాల, చంద్రుపట్ల తదితర గ్రామాలకు చెందిన బాధితులు స్థానిక పశువైద్యాశాఖ అధికారికి దరఖాస్తులు అందిస్తున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి వాటిని జిల్లా అధికారులకు పంపేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక పశువైద్యాధికారి మమత ధ్రువీకరించారు. వాటిని పరిగణలోకి తీసుకున్న తరువాత లబ్ధిదారులు ముందస్తుగా చెల్లించిన మూల ధనం వాటా నగదును వాపస్ చేసేందుకు జిల్లా అధికారులు నిర్ణయం తీసుకునే ఆవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తమ మూల ధనం వాటా నగదును వెంటనే తిరిగి చెల్లించాలని పలువురు బాధితులు కోరుతున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని పలు మండల్లాలో నెలకొన్నదని తెలిసింది.

4.77 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సతీష్‌కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మణుగూరుటౌన్, జూన్ 3: 4.77 క్వింటాళ్ల గంజాయిని మణుగూరులో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయికి సంబంధించిన వివరాలను సోమవారం సీఐ సతీష్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం మణుగూరు ఎస్ఐ మేడ ప్రసాద్ సిబ్బందితో కలిసి హనుమాన్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అశ్వాపురం నుంచి మణుగూరు మీదుగా జహీరాబాద్‌కు వెళ్లే రెండు వాహనాల్లో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పైలట్ వాహనంగా వస్తున్న కారులో ఇద్దరు వ్యక్తులుండగా.. వెనకాల వస్తున్న అశోక్‌లేలాండ్ వాహనంలో మామిడి కాయల మాటున గంజాయితో మరో ముగ్గురు వస్తున్నారు. ఈ క్రమంలో వాహనాలను తనిఖీ చేయగా వాహనాల్లో 4.77 క్వింటాళ్ల గంజాయిని ఉన్నట్లు తెలిపారు. వాహనాలతో పాటు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో యాదాద్రి జిల్లా, భువనగిరి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్, గుమ్మడెల్లి అర్జున్, మోతుగూడెం, పొల్లూరు గ్రామానికి చెందిన పంగి సునిల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గ్రామానికి చెందిన రాయకంటి నాగరాజు, ఎజ్జు సృజన్‌లు ఉన్నారని పేర్కొన్నారు. నిందితులను సోమవారం రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ మేడ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

జూలూరుపాడులో గంజాయి నిందితుల రిమాండ్

జూలూరుపాడు, జూన్ 3: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందుతులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ జీవన్‌రాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మండలంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో సూర్యాపేటకు చెందిన రాజేష్ గొట్టేటి, షేక్ నౌషిద్‌లు కలిసి ద్విచక్ర వాహనంపై రూ. 97,500 విలువ చేసే గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సోమవారం వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పాల్వంచ, జూన్ 3: పాల్వంచ పట్టణ పరిధిలోని ముర్రేడువాగు నుంచి అక్రమంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు ఇసుక తరలిస్తుండగా నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

దమ్మపేట, జూన్, 3: దమ్మపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాలను సోమవారం దమ్మపేట పోలీసులు షాపులపై దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట, మందలపల్లి గ్రామాలలో ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాన్‌షాపులు, కిరాణా దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీలలో రూ.లక్షా43వేల590 విలువ గల గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కబళించిన మృత్యువు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు దుర్మరణం
- సత్తుపల్లిలోని సింగరేణి ఓసీ వద్ద ఘటన



ప్రమాదంలో మృతి చెందిన పేరయ్య, అశోక్ (ఫైల్)

సత్తుపల్లి, జూన్ 3: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మడలంలని సింగరేణి ఓసీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు మృతి చెందారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన పిల్లి పేరయ్య (52), ఆయన కుమారుడు పిల్లి అశోక్ (30)లు బైక్‌పై సత్తుపల్లి నుంచి కిష్టారం వెళుతుండగా ఖమ్మం వైపు నుంచి అశ్వారావుపేట వైపు వెళుతున్న లారీ ఓపెన్ కాస్టు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనడంతో పేరయ్య, అశోక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అశోక్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6నుంచి సీపీఎం శిక్షణ తరగతులు: నున్నా



ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్3: ఈ నెల 6 నుంచి జిల్లా వ్యాప్తంగా సీపీఎం కార్యకర్తలకు నెల రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రకటించారు. సోమవారం జిల్లా సీపీఎం కార్యాలయం సుందరయ్య భవన్‌లో అఫ్జల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు సమాజాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల నుంచి దూరంగా మరలుస్తోందన్నారు. ఈక్రమంలో మతోన్మాదం వైపు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజకీయ శిక్షణ విభాగం జిల్లా కన్వీనర్ బండారు రమేశ్, టీఎల్ నర్సయ్య, యర్రా శ్రీనివాసరావు, ఆర్టీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రావినూతలలో లోవోల్టేజీ

- కాలిపోతున్న విద్యుత్ ఉపకరణాలు
- పట్టించుకోవాలని వేడుకోలు
- గ్రామంలో సబ్ స్టేషన్ ఉన్నా.. తప్పని విద్యుత్ సమస్యలు



బోనకల్, జూన్3: మండలంలోని రావినూతలలో లోవోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్ ఈ గ్రామంలో ఉన్నప్పటికి విద్యుత్ సమస్యలు మాత్రం ప్రజలకు తప్పడం లేదు. వ్యవసాయ సీజన్‌లో లోవోల్టేజీ కారణంగా ఒకేరోజు 14 వ్యవసాయ మోటర్లు కాలిపోయాయి. మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్‌కు చెందిన ఆరుమోటర్లు ఉన్నాయి. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొన్ని నెలలగా సమస్య ఉందని మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలోని శివాలయం వీధినుంచి బీసీ కాలనీలో కొన్ని ప్రాంతాలకు లోవోల్టేజీ వలన కూలర్లు, ఏసీలు ఆడటం లేదు. కొందరి ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోతుండటంతో లబోదిబోమంటున్నారు. ఎండ వేడిమి వలన పెరిగిన ఉష్ణోగ్రతల వలన ఉక్కపోత ఇబ్బందులు ఒకవైపు, విద్యుత్ ప్రసారం సక్రమంగా జరగక నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నా ఫలితం కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. సబ్‌స్టేషన్ నుంచి సరిపడ విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు. కాగా ఈ సమస్యపై ఏఈ ఉమామహేశ్వరావును వివరణ కోరగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను అధిగమిస్తామని చెప్పారు.

వేతనాలు అందక అప్పుల ఊబిలోకి!

- ఇబ్బందిపడుతున్న గ్రామపంచాయతీ కార్మికుల
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన





చెత్తను సేకరిస్తున్న కార్మికులు, వేతనాలు అందటంలేదని చెబుతున్న తనికెళ్ల పంచాయతీ కార్మికులు

కొణిజర్ల,జూన్3: గ్రామపంచాయతీ కార్మికులు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నుంచి నాలుగు నెలలుగా జీతాలు రాకపోవటంతో వారు పూటగడిచేందుకు అప్పులు చేస్తున్నారు. ఫలితంగా వారు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. ఏ ఒక్కరోజు విధులకు హాజరు కాకపోయిన చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు వేతనాలు విషయంలో పట్టించుకోవడం లేదని, తమ గోడును ఎవరికి చెప్పకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 105 మంది పబ్లిపర్పస్‌వర్కర్‌లు ఉన్నారు. చిన్నపంచాయతీలో ముగ్గురు, పెద్దపంచాయతీలో ఐదుగురు చొప్పున కార్మికులను నియమించారు. వీరు ఉదయం పూట మొదలుకొని సాయంత్రం వరకు వివిధ రకాల పనులు చేస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తడిపొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలిస్తుంటారు. గ్రామ పంచాయతీ నేతలు దగ్గర నుంచి ఉన్నతాధికారుల వరకు ఏ ఒక్క ముఖ్యులు వచ్చిన అన్ని పనులకు వీరినే వాడుతున్నారు. ఇంత కష్టపడుతున్న వీరికి మాత్రం సకాలంలో వేతనాలు ఇవ్వటంలేదు. మురుగు కాల్వలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి ప్రజలకు రోగాలను రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న పారిశుధ్య కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

డీలా చెందుతున్న కార్మికులు

ఎండనక, వాననకా కష్టపడి పని చేస్తున్న కార్మికులు వేతనాలు ప్రతినెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాన్ని పోషించలేక డీలా చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శులను అడుగుతుంటే మేమేమి చేయాలని అంటున్నారని, పనికిరాకపోతే మాత్రం ఎందుకు రావడం లేదని ఆగ్రహిస్తున్నారని, తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను ఎన్ని నెలలు పోషించాలని ప్రశ్నిస్తున్నారు. బయట పనులకు పోలేక పంచాయతీలో వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంవత్సరం నుంచి పంచాయతీలకు జమ చేయాల్సిన నిధులు ఇవ్వటంలేదని, కేంద్రం కూడా మూడు నెలలు నుంచి నిలిపివేసిందని అధికారులు చెపుతున్నారు. మండలస్థాయి అధికారులు వేతనాలు విషయంలో జాలిపడుతున్నారే తప్ప ఏమి చేయలేక పోతున్నారు.

ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వటంలేదు
దేరంగుల కొండయ్య



నాలుగునెలలు పూర్తి అయి పదో నెల అవుతున్న ఇంతవరకు వేతనాలు ఇవ్వటంలేదు. కుటుంబాన్ని పోషించడం భారమవుతుంది. ఇంత కష్టడుతున్న నెలకు వచ్చే సరికి జీతంరాకపోవడంతో ఇంటికి వెళ్లి ఏమి చేయాలో అర్థం కావటంలేదు. ప్రతి నెల వేతనాలు వచ్చేలా చూడాలి.

సమస్యను ఎవరికి చెప్పుకోవాలి
వేముల నాగేశ్వరరావు



వేతనాలు రావడంలేదని కార్యదర్శి నుంచి మండలాధికారుల వరకు చెప్పుకున్నాం. అయిన ఐదు నెలలు నుంచి వేతనాలు రావడం లేదు. తమ సమస్యను ఎవరికి చెప్పుకుంటే వేతనాలు ఇస్తారో అర్థంకావడం లేదు. ప్రభుత్వాలు, అధికారుల తీరు కారణంగా ఇబ్బందిపడుతున్నాం.

కొంతఇబ్బంది పడుతూనే ఉన్నారు
ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి

ట్రెజరీలో సమస్య కారణంగా వేతనాలు ఇవ్వటంలో ఆలస్యం అవుతుంది. పంచాయతీ నుంచి ట్రెజరీకి పంపుతున్నాం. అక్కడే సమస్య ఉంది. కొన్ని పంచాయతీలకు నిధులు లేవు. ఆ పంచాయతీలో కార్మికులకు వేతనాలు ఇవ్వడం కష్టంగా మారింది. ట్రాక్టర్‌లకు ఈఎంఐలు కట్టడం కూడా కష్టంగానే ఉంది. ఆయా పంచాయతీల కార్మికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తమే.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్ 3: ఖమ్మం నగరంలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని పలు డివిజన్లలో సీపీఐ నాయకులు యానాల సాంబశివారెడ్డి, ఎండీ రెహమాన్, శేఖర్, జ్వాలా నర్సింహారావు, ఖాసీంపాషా,జానీ,వీ.రమణ పర్యటించారు. ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు.

రైతు భరోసా అందించాలి

కల్లూరు, జూన్3 వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున తక్షణమే రైతు భరోసా కింది ఎకరాకు రూ.15000 అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాచర్ల భారతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని పోచారంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆరు హామీలు అమలు చేస్తామని వాగ్దానం చేసి అందులో రెండు హామీలను మాత్రమే అమలు పరిచారన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాదినేని రమేష్, తాత భాస్కరరావు, మండల సిపిఎం కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, నాయకులు ముదిగొండ అంజయ్య, సామినేని అన్నమయ్య, డి.పుల్లయ్య, నాయడు చందర్‌రావు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలి : డీవైఎఫ్ఐ

ఖమ్మంరూరల్, జూన్3: గంజాయి నియంత్రణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని ఏదులాపురంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నేటి యువత గంజాయికి బానిసలు అవుతున్నారని పట్టణ ప్రాంత యువకులే కాకుండా, గ్రామీణ ప్రాంత యువత కూడా గంజాయికి బానిసలవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యాక్షులు కూరపాటి శ్రీను, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, అనిష్, పవన్, సత్యనారాయణ, రేవంత్, బాషా, విజయరెడ్డి, నాగేశ్వర రావు, ఉపేందర్, యాదగిరి, అన్వేష్, నరసింహరావు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తోలకాలతో ప్రమాదకరంగా గోతులు

- వైరా రిజర్వాయర్‌లో అడ్డగోలుగా తవ్వకాలు





వైరా రిజర్వాయర్‌లో జరుగుతున్న మట్టి తోలకాలు, ప్రమాదకరంగా ఉన్న గోతులు

వైరా, జూన్3: వైరా రిజర్వాయర్‌లో రెండునెలల నుంచి చెలరేగిపోతున్న మట్టి దందాతో ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి. రైతుల పేరుతో అనుమతులు తీసుకున్న మట్టి అక్రమార్కులు అడ్డగోలుగా రిజర్వాయర్‌లో తవ్వకాలు జరుపుతున్నారు. ఆ గోతుల్లో నీరుచేరి స్థానికులు ప్రమాదాల బారిన పడతారనే ఆందోళన వ్యక్తమవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతరుల నుంచి రైతుల పేరుతో అధికారులకు సిఫారసు చేయించుకొని మట్టి తవ్వకాలకు అనుమతి సాధించిన అక్రమార్కులు ఇష్టానుసారం రిజర్వాయర్‌లో తవ్వకాలు చేస్తున్నారు. రిజర్వాయర్‌లో ఆరేడుచోట్ల గ్రూపులుగా ఏర్పడి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. నిత్యం వేలాది ట్రాక్టర్ల మట్టి బయటకు తోలుతున్నారు. ఈ మట్టి తోలకాల వలన రిజర్వాయర్‌లో ఏర్పడిన పూడిక కొంత తొలగిపోయి నీటిసామర్థ్యం పెరిగే అవకాశమున్నప్పటికీ.. తవ్వకాలు జరుగుతున్న తీరు మాత్రం ఆందోళనకరంగా ఉంది. ఒక క్రమపద్ధతిలో రెండు, మూడ అడుగుల లోతులో మట్టి తవ్వకాలు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా పది అడుగుల లోతులో తవ్వకాలు జరుగుతున్నాయి. రైతులకు రెండు, మూడు అడుగుల లోతులోని సారవంతమైన నల్లరేగడి మట్టి మాత్రమే తమ భూముల్లో సారవంతానికి ఉపయోగపడుతుంది. అయితే రైతుల పేరుతో అనుమతులు తీసుకున్నప్పటికీ రైతుల పొలాలకు తోలిన మట్టి మాత్రం నామమాత్రంగానే ఉంది. ఎక్కువ భాగం మట్టిని వెంచర్లు ఇతరత్రా అవసరాల కోసం భారీగా తోలుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రక్కు మట్టిని రూ.600 నుంచి రూ.800వరకు విక్రయిస్తున్నారు. నల్లమట్టికి బదులు గ్రావెల్ కోసం లోతుగా తవ్వకాలు చేస్తున్నారు. ప్రజలతోపాటు పశువులు కందకాల్లో పడిపోయి ప్రమాదాల బారీనపడే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ కందకాలు పూడేందుకు కనీసం నాలుగైదేళ్ల సమయం పడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు మట్టి తవ్వకాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణకు నివాళి

వైరా, జూన్3: ప్రజల జీవితాల్లో మార్పు వస్తేనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సార్థకత చేకూరుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గన్నవరం గ్రామంలో సీపీఎం నాయకుడు బుంగా కృష్ణ మూడోవర్ధంతి సభలో రాంబాబు మాట్లాడారు. కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం జెండా ఆవిష్కరించారు. సీపీఎం మండల, గ్రామకార్యదర్శులు తోట నాగేశ్వరరావు, శీలం వెంకటరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ వితరణ



వైరా,జూన్3: మండలంలోని ఖానాపురంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సన్‌రైజ్ అభ్యుదయ సేవసమితి ఆధ్వర్యంలో బేబీచైర్స్ ఇతర ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు.తల్లి భవానీ జ్ఞాపకార్థం ఏనుగు శివరాఘవ ఫర్నీచర్‌ను కల్లూరు ఎంపీవో సురేష్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాలతీదాసు, దాసు, సుమన్‌బాబు పాల్గొన్నారు.

పాలీసెట్ ఫలితాల్లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్3: సోమవారం విడుదలైన తెలంగాణ పాలీసెట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కృష్ణవేణి, త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాలకు చెందిన మోక్షిత సాయి 118 మార్కులు, లక్ష్మి 113, నేహ 105, వెంకటేశ్వర్లు, అభిరాం 101, సాత్విక్ 98 మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి పాటుపడాలి: సీపీ



మతపెద్దలతో మాట్లాడుతున్న సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం,జూన్3: మతసామరస్యానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సీపీ కార్యాలయంలో సోమవారం పీస్‌కమిటీ సభ్యులతో శాంతిసమావేశం నిర్వహించారు.పండుగను శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే అక్రమరవాణ కట్టడికి కమిషనరేట్ పరిధిలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం తనిఖీలు చేస్తున్నామని, నిబంధనలు విరుద్ధంగా పశువుల అక్రమరవాణ జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఎవరూ తము చేతుల్లోకి తీసుకుని విఘాతం కలిగించే పరిస్థితులు తీసుకురావద్దని సూచించారు. ఈద్గాలో ప్రార్థనలకు ఎలాంటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని మునిసిపల్ అధికారులతో కలిసి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈసమావేశంలో అదనపు డీసీప ప్రసాదరావు, ఏసీపీ ప్రసన్నకుమార్, గెంటేల విద్యాసాగర్, విజయపాల్‌రెడ్డి , రామకృష్ణ, ఎండీ అసద్, అయూబ్, మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శివాయిగూడెం వివాదంలో.. నిందితుల రిమాండ్

రఘునాథపాలెం, జూన్4: శివాయిగూడెంలో చోటు చేసుకున్న భూ వివాదంలో వ్యక్తి మరణానికి కారణమైన నిందితుల్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. శివాయిగూడెంలో ఓ భూవివాదంపై సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకొంది. ఈ క్రమంలో తేజావత్ వీర్య(65)ను ఆదే గ్రామానికి చెందిన భానోత్ దశరథ్, భానోత్ రమేశ్, తేజావత్ రాంబాబు, భానోత్ రవి నెట్టటంతో వీర్య మరణించారని సీఐ శ్రీహరి తెలిపారు. నిందితులను మంగళవారం రిమాండ్ చేశామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రఘునాథపాలెం, జూన్3: శివాయిగూడెంలో సోమవారం కన్నుమూసిన తేజావత్ ఈర్యనాయక్ భౌతిక కాయానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు పగడాల నాగరాజు, మక్బూల్, కూరాకుల వలరాజు, కన్నం కృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బిల్లు లేకుండా విత్తనాలు విక్రయించొద్దు

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

చింతకాని,జూన్3: బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయించరాదని డీఏవో విజయనిర్మల అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగులవంచలోని విత్తన దుకాణాలను తనఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు. దుకాణంలో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. బీజీ-2 రకం పత్తి విత్తనాలన్ని ఒకేటేనని రైతులు అన్నికంపెనీల విత్తనాలను కొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏవో నాగయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఏవో

వ్యవసాయ, పోలీసు అధికారుల తనిఖీ

వైరా: మండలంలోని తాటిపూడి విత్తన దుకాణాల్లో విత్తనాల విక్రయాలు, నిల్వలను సోమవారం వ్యవసాయ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. వైరా ఏడీఏ టి.కరుణశ్రీ, ఏవో ఎస్.పవన్‌కుమార్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ఏఎస్ఐ వెంకటనారాయణ దుకాణాలను తనిఖీ చేసి వివిధ కంపెనీల విత్తన ప్యాకెట్ల లాట్‌నెంబర్లు, జీవోటీలు పరిశీలించారు. డీలర్ లైసెన్స్‌లు, స్టాక్ రిజిస్టర్లు, రోజువారి విక్రయాల రిజిస్టర్లను పరిశీలించి విత్తన డీలర్లు, రైతులకు సూచనలు చేశారు.



విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఎస్ఐ

భద్రత భగవంతుడెరుగు

కనీస జాగ్రత్తలు లేకుండా విద్యుత్ పనులు



ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్3: నిత్యం జిల్లాలో పదుల సంఖ్యలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖమ్మంనగరంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు ఉద్యోగులు ప్రమాదస్థలంలోనే కన్నుమూశారు. అయినా విద్యుత్ ఉద్యోగులు కనీస భద్రతా ప్రమాణాలు పాటించటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. సోమవారం ఖమ్మం బైపాస్ రోడ్డులో ఓ ట్రాన్స్ ఫార్మర్ వద్ద పనులు చేస్తున్న ఇద్దరు జేఎల్‌ఎంలు, ఇక ఆన్‌మ్యాన్ ఉద్యోగి కనీస భద్రతా పరికరాలు లేకుండా పనులు చేశారు.

తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

వైరా, జూన్ 3: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ బీఆర్ఎస్ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మధిరటౌన్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి చేసిన పోరాటం వల్లే రాష్ట్రం ఏర్పడిందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. సోమవారం మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల ముగింపు సందర్భంగా మలిదశ ఉద్యమ కారులను సన్మానించారు, అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు, శివాలయం మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు నాయకులు ప్యారి, జె.వి.రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామారావు, ఇందిర కౌన్సిలర్ సయ్యద్ ఇక్బాల్ పాల్గొన్నారు.





మలిదశ ఉద్యమకారులను సన్మానిస్తున్న కమల్ రాజు, తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న మదన్‌లాల్

మలిదశ ఉద్యమకారుడికి సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు పొదిల వెంకటేశ్వర్లును సోమవారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఉద్యమ సమయంలో ఆయన పోరాటాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుత్త వెంకటేశ్వర్లు, మారెళ్ల లక్ష్మణరావు, తాత రఘురాం, మామిళ్ల రాంబాబు, నిజాం పాల్గొన్నారు.

దొడ్డికొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ ఎన్నిక

ఖమ్మంసాంస్కృతికం, జూన్3: సబ్బండ వర్గాల సహ నిర్మాణ పద్దతిలో నిర్మించనున్న దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీని సోమవారం ఖమ్మం చెరువు బజార్‌లోని గ్లోబల్ హెల్పింగ్ సెంటర్ హాల్లో ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు ఈ సినిమాను నిర్మించ తలపెట్టారు. చిత్ర దర్శకుడు ఎం సేనాపతి మాట్లాడుతూ సబ్బండ వర్గాలను ఐక్యం చేస్తూ వారిని సహ నిర్మాతలను చేస్తూ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లా గౌరవ సలహాదారుగా ఖిజరుల్లా, జిల్లా చైర్మన్‌గా బాణోత్ భద్రునాయక్ పాల్గొన్నారు.

అనంతారం వాసికి డాక్టరేట్



ఖమ్మంఖానాపురంహవేలి, జూన్3: మండల పరిధిలోని అనంతారం గ్రామవాసి ఇనుకొండ రవీంద్రకు చరిత్ర పరిశోధనలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణలో కులం, రాజకీయం, అధికారం, జిల్లాపై ఒక అధ్యయనం అనే అంశంపై ప్రొఫెసర్ వడ్డానం శ్రీనివాసరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేయటంతో యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.